బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి సన్మానం

ఆత్రం సక్కును సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్, నాయకులు

బోథ్, ఏప్రిల్ 1 : ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును సోమవారం బోథ్ మండల పరిషత్ కార్యాలయ సమీపంలో నాయకులు సన్మానించారు. అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం మొదటి సారిగా ఇక్కడికి వచ్చిన సందర్భంగా శాలువాతో సత్కరించారు. గెలుపు కోసం కృషి చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, జడ్పీటీసీ సంధ్యారాణి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఆర్ రుక్మాజ్‌సింగ్, సురేందర్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి, స్వామి, ఎలుక రాజు, ప్రవీణ్, ప్రశాంత్, రమేశ్, నారాయణ, వెంకటరమణ, బుచ్చన్న, సుభాష్, సోమేశ్వర్, బొడ్డు శ్రీనివాస్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో జూనియర్ డాక్టర్ల సేవలు

జూనియర్ డాక్టర్లకు సూచనలు చేస్తున్న రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్

ఎదులాపురం, ఏప్రిల్ 1 : ఆదిలాబాద్ రిమ్స్‌లో సోమవారం నుంచి కొత్త జూనియర్ డాక్టర్లు సేవలందించడం ప్రారంభించారు. 2019 బ్యాచ్‌కు చెందిన 101 మంది వైద్య విద్యార్థులు జూనియర్ డాక్టర్లుగా సేవలు ప్రారంభించారు. ఇందులో భాగంగా వార్డులో వారు అందిస్తున్న సేవలను రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. నిస్వార్థంతో రోగులకు సేవలు అందించాలని సూచించారు.

ఎన్నికల శిక్షణ ప్రారంభం

ఇచ్చోడ, ఏప్రిల్ 1 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో బోథ్ నియోజకవర్గంలోని రెవెన్యూ, ఉపాధ్యాయులు, అధికారులకు పీవో, ఏపీవో, వోపీవోలకు రిటర్నింగ్ అధికారి ఖుష్బూగుప్తా ఆదేశాల మేరకు సోమవారం అధికారులు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎం పనితీరు, పోలింగ్‌పై శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు తుకారాం, డిప్యూటీ తహసీల్దార్ రామారావ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న అధికారి

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్
- పైపులైన్ మరమ్మతు పనుల పరిశీలన

మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 1: వేసవిలో పట్టణ వాసులకు నీటి ఎద్దడి తలెత్తకుండా మున్సిపల్ యంత్రాంగం తరపున పూర్తి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఫిల్టర్ బెడ్‌లో మున్సిపల్ నిధులతో చేపడుతున్న పైపులైన్ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని చిన్నపాటి మరమ్మతులను పూర్తి చేస్తున్నామని అన్నారు. పుర ప్రజలకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారుల సమన్వయంతో మరమ్మతు పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట భూమన్న, సృజన్, మూర్తి ఉన్నారు.

సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలి

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 1: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమయపాలన పాటిస్తూ వైద్యాధికారులు విధులు నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. దవాఖానలోని రికార్డులు పరిశీలించి రోజు వారి ఓపి విభాగంను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా మండలంలో హెల్త్ క్యాంపుల ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వడదెబ్బ తగిలే సూచనలు ఉన్నాయని అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు వెళ్లాలి తప్ప ఎండల్లో తిరగవద్దని సూచించారు. ఆమె వెంట వైద్యాధికారులు భీంరావ్, అలేఖ్య, హెచ్ఈవో సూర్యప్రకాశ్, సూపర్‌వైజర్ దేవీదాస్, వైద్యసిబ్బంది ఉన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన

టీబీ సోకకుండా జాగ్రత్తలు పాటించాలి

మాట్లాడుతున్న షేర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సతీశ్ కపిల్వార్

ఎదులాపురం, ఏప్రిల్ 1 : క్షయ నివారణ కేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బంది ఆ వ్యాధి బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని షేర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సతీశ్ కపిల్వార్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీబీ కార్యాలయంలో టీబీ నివారణ విభాగంలో పని చేసే సిబ్బందికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధితో బాధపడుతున్న వారికి చికిత్స అందించే సమయంలో మాస్కులు ధరించాలని సూచించారు. రోగుల నుంచి తెమడ సేకరించి పరీక్షలు చేసే సమయంలో వారికి చికిత్స అందించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. టీబీ వ్యాధిగ్రస్తులను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే వ్యాధి నివారణ సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యుడు ప్రమోద్, డీటీసీవో డాక్టర్ సాయిప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల సందర్శన

తాంసి, ఏప్రిల్ 1: తాంసి మండలంలోని గిరిజన గ్రామాలను సోమవారం ఐటీడీఏ అధికారులు సందర్శించారు. లిమ్‌గూడ, గిరిగాం, అట్నంగూడ గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అధికారులను వివరాలు అడిగారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు గ్రామాలను సందర్శించామని ఐటీడీఏ ఏసీఎంవో జగన్ తెలిపారు. తాగునీటి సమస్యపై ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీఆర్పీ నానాజీ పాల్గొన్నారు.

బావిని పరిశీలిస్తున్న ఐటీడీఏ ఏసీఎంవో జగన్

మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 1: గ్రామీణ ప్రాంతంలోని మహిళలతో పాటు చదువుకొని యువతులకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ఇస్తున్నట్లు హెల్ప్ విల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాంబ్లే ఆతీశ్‌కుమార్, నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేందర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నాక్ వారి సహకారంతో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్ప్ విల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు, యువతులకు 90 రోజులు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా కుట్టుమిషన్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఇచ్చోడ, ఏప్రిల్ 1 : రైతులు తమ పశువులను కాపాడుకునేందుకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశు వైద్య సిబ్బంది అన్నారు. సోమవారం నవేగాం గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శేఖర్, దేవ్‌రావ్, రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

జైనథ్(బేల), ఏప్రిల్ 1: బేల మండలం సాంగిడి పెన్‌గంగ తీరాన రూ.2 కోట్లతో చేపడుతున్న సుందర శివాలయ నిర్మాణానికి సోమవారం వేద పండితులు భూమిపూజ చేశారు. ఐదుగురు ఉద్యోగుల జంటలు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ మంత్రి జోగు రామన్న, బీజేపీ నాయకురాలు సుహాసిని రెడ్డి వేర్వేరుగా హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిప్ప రమేశ్, అశోక్, సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, ఏప్రిల్ 1 : జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటీ కార్యాలయంలో ఖాళీగా ఉన్న (1) ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు ఏడు నుంచి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. పదో తరగతి చదువుకున్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు పత్రాలను ఈ నెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు డీఎల్ఎస్ఏ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

మైనార్టీ మహిళలకు సరుకులు పంపిణీ

మైనార్టీ మహిళలకు సరుకులు పంపిణీ చేస్తున్న జాదవ్ రవి దంపతులు

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 1 : రంజాన్ మాసం పురస్కరించుకొని లక్కారం గ్రామంలో సామాజిక కార్యకర్త జాదవ్ రవి నాయక్, ప్రేమ దంపతులు తమ వంతు సహాయంగా పేద ముస్లిం మైనార్టీ మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి మృతి

గోవింద రాజు(ఫైల్)

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 1 : మావల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందాడు. జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గోవింద రాజు కారులో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా మావల వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి కంటైనర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

ఉపాధి కూలీ రూ.600 ఇవ్వాలి

తాంసి, ఏప్రిల్ 1 : ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించి కూలీ రూ.600 ఇవ్వాలని బీకేఎంయూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అర్ధాంగి రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కప్పర్ల గ్రామంలో ఉపాధి కూలీలు తమకు రెండు నెలలుగా కూలీ డబ్బులు అందడం లేదని తమ సమస్యను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 1: ఆదిలాబాద్ రూరల్ మండలం లోకారి గ్రామానికి చెందిన సాయిరెడ్డి అక్రమ మద్యం అమ్ముతున్నారని సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. 11.8 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ సుమారు రూ.13 వేలు విలువ ఉంటుందని రూరల్ ఎస్ఐ సయ్యద్ ముజాహిద్ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ రమేశ్, పీసీ దినకర్ పాల్గొన్నారు.

మద్యాన్ని స్వాధీనం చేసుకున్న రూరల్ ఎస్ఐ సయ్యద్ ముజాహిద్

కిరణ్ ఆశయాలను సాధించుదాం

నివాళులర్పిస్తున్న నాయకులు

ఎదులాపురం, ఏప్రిల్ 1 : తెలంగాణ ప్రగతిశీల ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, ఆటో కార్మిక వీరుడు వీ కిరణ్ ఆశయాలను సాధించుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కుమ్రం భీం భవనంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ సంస్మరణ సభను నిర్వహించారు. కిరణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ సహాయ కార్యదర్శి నితిన్, నాయకులు సచిన్, మధుకర్, బుచ్చిరాం, రాజు, నరేశ్, రేణుక, అంజలి, రుక్మాబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

భీంపూర్, ఏప్రిల్ 1 : 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని భీంపూర్ ఎస్ఐ ప్రదీప్‌కుమార్ సూచించారు. సోమవారం నిపాని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదిలాబాద్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అమూల్యమైనదని సద్వినియోగం చేసుకోవాలని గుర్తు చేశారు. యువత వ్యసనాలు వీడి స్వామి వివేకానంద బోధనలు ఆచరణలో పెడితే సమాజ ప్రగతి సుసాధ్యమవుతుందన్నారు. ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు రమేశ్, నర్సమ్మ, వెంకట్రావు, శ్రీలత, రాజు, మురళి, శంకర్, గోవింద్ ఆటాపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌వైకే సిబ్బంది మజీద్, మాజీ సర్పంచ్ రాజన్న, నాయకులు అనిల్, ముకుంద సంతోష్, గాంధీ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నిపానిలో ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు, అధికారులు

సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం,ఏప్రిల్ 1 : లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ యూనియన్ నాయకులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. బీపీ, షుగర్, ఓపెన్‌హార్ట్ సర్జరీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు, దివ్యాంగులు, గర్భిణులకు, 58 సంవత్సరాలు పైబడిన వారికి పూర్తిగా ఎన్నికల విధుల నుంచి మినహాయించాలన్నారు. ఎన్నికల విధులకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు రిపోర్టు చేయడానికి వెళ్లే వారికి ప్రత్యేక బస్సులు కేటాయించాలన్నారు. ఈవీఎం ద్వారా జరిగే ఎన్నికలు కావున శిక్షణ సమయంలో ఈవీఎంలపై పూర్తి స్థాయిలో ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వాలన్నారు. తదితర సమస్యలను కలెక్టర్ రాజర్షి షాకు వివరించారు. కలిసిన వారిలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్‌సింగ్, నర్ర నవీన్‌యాదవ్, తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఇచ్చోడ: సిరికొండలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తాంసి, ఏప్రిల్ 1: ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శివరాం కోరారు. సోమవారం కప్పర్ల గ్రామంలో కేంద్ర బలగాలతో కలిసి రైతు వేదిక నుంచి బస్టాండ్ వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికల నిబంధనలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఎన్నికల విధులకు ఆటంకాలు కలిగించి అల్లర్లు సృష్టిస్తే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఎవరిపైన కేసు నమోదైనా వారిపై కేసు కొట్టి వేయకుండా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కేశవ స్వామి, కానిస్టేబుళ్లు సంతోష్, దశరథ్, సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి: మాట్లాడుతున్న ఎస్ఐ శివరాం

ఇచ్చోడ(సిరికొండ), ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గ్రామస్తులకు ధైర్యం కోసమే పోలీస్ కవాతు నిర్వహిస్తున్నామని ఇచ్చోడ సీఐ భీమేశ్ అన్నారు. సోమవారం సిరికొండలో సీఆర్ఎఫ్, పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా మద్యం, డబ్బు, ఎలాంటి ప్రలోభాలకు లొంగకూడదన్నారు. స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో సిరికొండ ఎస్ఐ నవీన్ గౌడ్, పోలీసులు, సీఆర్ఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 1 : ఆదిలాబాద్ పట్టణ బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు సంఘం నూతన అధ్యక్షుడు లాంపిలే వాసుదేవ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘానికి ఏ ఇతర ట్రేడ్ యూనియన్లతో సంబంధం లేదని ఇక నుంచి స్వతంత్రంగా పని చేస్తుందని పేర్కొన్నారు. ప్రజలు పెయింటింగ్ వర్కర్స్ వద్ద గుర్తింపు కార్డు ఉంటేనే పనులు చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో సంఘం నాయకులు సందీప్, వసీం, రాంకిషన్, జయరాజ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

రైతు దేశానికి వెన్నెముక

రైతు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మున్నూరుకాపు సంఘ సభ్యులు

కుంటాల, ఏప్రిల్1 : రైతు దేశానికి వెన్నెముక అని మున్నూరుకాపు సంఘం తాలుకా అధ్యక్షుడు రోళ్ల రమేశ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం ఆవరణలో రైతు విగ్రహాన్ని సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం విగ్రహదాత కొత్తకాపు గంగన్నను సభ్యులు సన్మానించారు. ఇక్కడ మున్నూరుకాపు సంఘం మండలాధ్యక్షుడు గోవింద రాజు, కుంటాల సంఘం అధ్యక్షుడు తోట రఘు, ఉపాధ్యక్షుడు జక్కుల గజేందర్, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, ఉమ్మడి జడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, ఆయా గ్రామాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్య

తానూర్, ఏప్రిల్ 1 : కోలూర్ గ్రామానికి చెందిన గైలేవార్ మొగులాజీ (32) మద్యానికి బానిపై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ నర్సింగ్ భాను తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మొగులాజీ మార్చి 31న మద్యం తాగడానికి తండ్రిని డబ్బులు అడిగాడు. ఆయన నిరాకరించడంతో తన చేనుకు వెళ్లి అక్కడ ఉన్న వేప చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడికి పాప, బాబు ఉన్నారు. మృతుడి భార్య అర్చన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మక్క చేను దగ్ధం

కుంటాల, ఏప్రిల్ 1 : ఓలా శివారులో అమీరుద్దీన్ అనే రైతు రెండెకరాల్లో మక్క పంట వేశాడు. ప్రమాదవశాత్తు మక్క చేనులో కొంత భాగం పంట కాలిపోయింది. అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. రూ.30 వేల నష్టం వాటిల్లినట్టు రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

పాస్‌పోర్ట్ పోయినది

నేను గుగ్లావత్ గబ్బర్‌సింగ్ తండ్రి గుగ్లావత్ వాల్య, లింగాపూర్ గ్రామము: మం: మామడ జిల్లా: నిర్మల్ తెలంగాణ నా యొక్క పాస్‌పోర్ట్ నెం.M1859098 గల పాస్‌పోర్ట్ తేది: 08-03-2024 రోజున లింగాపూర్ గ్రామము నుండి మామడ మండలంకు బైక్‌పై ప్రయాణించగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు. ఈ క్రింది నెంబర్‌కు తెలియజేయండి. సెల్ నెం: 90105 10664.

పాస్‌పోర్ట్ పోయినది

నేను బుక్య వినోద్ తండ్రి: మోతిలాల్ ఇ.నెం.4-47, గ్రా॥ తాటిగూడ, మం॥ పెంబి, జి: నిర్మల్, తెలంగాణ నా యొక్క పాస్‌పోర్ట్ నెం.K3639678 గల పాస్‌పోర్ట్ తేది:03-03-2024 రోజున మందపల్లి గ్రామం నుండి తాటిగూడ గ్రామానికి బైక్‌పై ప్రయాణించగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది నెంబర్‌కు తెలియజేయండి. సెల్: 9347365255

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677